# సంప్రదాయం



– ఎం.వెంకటేశ్వరరావు

సమయం ఉదయం ఏడుగంటలు.

విజయవాడ బస్టాండు. ముప్ఫయిమూడో నంబరు ప్లాట్‌ఫారం.

'విజయవాడ–మచిలీపట్నం' నాన్‌స్టాప్ టికెట్‌కౌంటర్ చీమలబారులా వుంది.

బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న నేను, డ్యూటీకి పదిగంటలకల్లా .. మచిలీపట్నం చేరుకోవాలి.

వేగంగా వచ్చి 'క్యూ' చివర్న నుంచున్నా. ప్రక్కనే ఆడవాళ్ళ క్యూ. సరిసమానంగా వుందారోజు. వేసవి ఆరంభమవటంతో కారుతున్న చెమట చొక్కా తడిపేస్తోంది. క్యూ మందకొడిగా కదుల్తోంది.

"ఆ మాంగోజూస్ చల్లని మాంగోజూస్ సార్" అంటూ బాటిల్ మొహాల ముందు తిప్పుతూ ఒకతను.

"పాప్‌కార్న్ వేడివేడి పాప్‌కార్న్. పాకెట్ రూపాయం"టూ స్త్రీలు ఎత్తుకున్న పిల్లల ముందు తిరుగుతూ మరొకతను.

"మాస్టారూ! ఇంకో టికెట్ తీసుకోండి" వెనుక నుండి నా భుజం తడుతూ అన్నాడొకతను.

"సారీ సర్! క్యూలో రండి" అన్నాన్నేను అతనివ్వబోతున్న డబ్బు నిరాకరిస్తూ.

"లగేజీ పైనేయించాలి. మీరైనా తీసుకోండని" నా వెనుక నుంచున్నతన్ని బ్రతిమాలే ధోరణిలో అడిగాడు.

అతను నాకన్నా తీవ్రంగా బదులివ్వడంతో నా ముందు నుంచున్న ముసలాయనడిగాడు.

"అరవై ఏళ్ళవాణ్ణి. అరగంట నుంచీ నుంచున్నాను. ఇరవై ఏళ్ళవాడివి. నువు నుంచోలేవటయ్యా" అన్నాడు వ్యంగ్యంగా.

ఇంతలో ఆడవాళ్ళ క్యూలో వెనక నుంచున్నామె ముందుకెళ్ళి పక్క నుండి కౌంటర్లో చెయ్యిపెట్టబోయింది.

అంతే! "ఏవమ్మో! గంట నుంచి కాళ్ళు పీక్కుచ్చేనా క్యూలో నుంచుంది ముందు నిన్ను పంపటానికా? పో పొయ్యి వెనకాల క్యూలో రావమ్మా" కోరస్‌గా గొల్లుమన్నారు. ఆడవాళ్ళు.

"అర్జంటుగా వెళ్ళాలి.. ఒక్క టిక్కెట్ తీసుకోనివ్వండంటూ" మళ్ళీ చెయ్యి పెట్టబోయినామెను ఈసారి గట్టిగా వెనక్కు నెట్టడంతో క్యూ చివరకొచ్చిపడిందావిడ.

"ఏందమ్మో ఏం పోయేకాలమొచ్చింది మీకు అలా నెట్టేస్తున్నారు. ఆ మొహాన్ని తొందరగా రమ్మన్నా రాకపోబట్టి నాకీ తిప్పలు" అంటూ మొగుణ్ణి తిడుతూ వెనక నుంచుంది.

కదుల్తున్న 'క్యూ' కళ్ళాలేసినట్టు ఆగిపోయింది. కౌంటరు క్లోజయింది.

"టాక్సీ ... టాక్సీ ... బందరు టాక్సీ ... గంటలో తీసుకెళ్తాను. రండి సార్" అంటూ తిరుగుతూ ... ఒకళ్ళిద్దర్ని పికప్ చేసుకున్నాడు టాక్సీవాలా.

ఆడవాళ్ళ క్యూలో నుంచున్న ఓ ఇరవైఏళ్ళ అమ్మాయి దగ్గరికి కుంటుతున్న ఓ యువకుడొచ్చి ...

"ఎక్స్‌క్యూజ్‌మి ఓ టికెట్ తీసుకొస్తారా కాలు ఫ్రాక్చర్. నిలబడనీయటంలేదు" అన్నాడు డబ్బిస్తూ ... తీసుకోబోతున్న ఆమె చేతిని వేగంగా వెనక్కి లాగి ...

"తీసుకోకు. నెంబర్ల ప్రకారం కూచోవాల్సొస్తే ... వాడు నీ పక్కకొస్తాడు. వాడి వాలకమే సర్లేదంటూ" చెవికొరికింది ముందునుంచున్న ఆ పిల్ల బామ్మ.

స్తబ్ధగా నుంచున్న క్యూలో కదలిక ప్రారంభమయింది.

మళ్ళీ కౌంటరు తెరిచారు.

"సార్! టికెట్‌కి అర్ధరూపాయియండి సార్ రెండు నిమిషాల్లో తెచ్చిస్త" అంటూ తిరుగు ..

తోందో పదిహేనేళ్ళ పిల్ల. బ్లాక్‌లో టికెట్లమ్మే సిన్మాహాల్లోలా చూసి ఆశ్చర్యపోయాను.

అంతకుముందు అందరిచేతా తిట్లుతిని వెనక్కెళ్ళినామె బ్లాక్‌లో టికెట్ తెప్పించుకుని అందరిముందూ హాయిగా జడతిప్పుతూ ... ఎక్కాల్సిన బస్‌వైపు కదిలింది.

'క్యూ' లో టికెట్ తీసుకుని బస్‌వైపు నడిచాన్నేను.

కంప్యూటర్ ద్వారా ఇచ్చిన టికెట్లలో సీట్ నంబరింగ్ వుంది.

విండో పక్కనున్న నా సీట్లో ఎవరో 'ప్రెగ్నెంట్' కూచుంది.

ఆవిణ్ణి లేపటం ఎందుకనుకుని ... "మీ సీటు నంబరు చెప్పండన్నాను"

"థాంక్సండీ నా సీటు నంబరు ఏడు. ముందుంది" ఆ సీట్లో ఓ తాతగారూ, ఆయన భార్య కూచున్నారు. ఆవిడ నన్ను చూసి నేనడక్కముందే ...

"బాబూ ఇది నీ సీటా ఈయనకు ఒంట్లో బాగుండలేదు. పట్టుకుంటేగాని కూచోలేకపోతున్నారు. నాసీటు వెనకాల ముప్పయ్ అయిదు. అందులో కూచో" అంది అభ్యర్థనగా.

ముప్పయినాలుగు విండోపక్క సీటు. అందులో ఒకావిడ కూచుంది. ఆవిడ పక్కనెలా కూచోవాలా అని సంకోచిస్తూనే ...

"ఏమండీ ఇది నా సీటండీ" అన్నాను.

"నాపక్కన మీరెలా కూచుంటారండీ"

"నా సీటు నంబరు ముప్పయి అయిదు" అన్నాన్నేను.

"అయితే వేరెక్కడైనా అడ్జస్టవండి. ఇక్కడ వీలుగాదు" అందావిడ సొంత బస్‌లా.

"వెనకాల ఒకావిడ పక్కన ఖాళీ వుంది ... మీరు"

"అవన్నీ నాకు తెలియదండీ. నా నంబరు ప్రకారమే నేను కూచున్నాను. వెనకాల బస్సు కుదుపులకు నేను కూచోలేను" అందామె కరాఖండీగా.

ఆవిడతో ఒకళ్ళిద్దరు చెప్పిచూసినా లాభం లేకపోయింది. వెనకసీట్లో మరొకామె వచ్చి కూర్చోవడంతో అదీ భర్తీ అయింది.

నేనెక్కడ కూచోవాలో తెలీలేదు.

డ్రైవరు బస్సెక్కి సీట్లు కౌంట్ చేసుకుంటూ నుంచున్న నాతో "మీ సీటెక్కడండీ" అన్నాడు.

చెప్పాను.

డ్రైవరు ఆమెతో చెప్పి చూశాడు. ఆమె వినకపోగా "మీ అక్కో, చెల్లెలో అయితే ఇలా పరాయి మగాళ్ళ పక్కన కూచోబెడ్తావా? నా నంబరు ప్రకారమే కూచున్నా నేల్లేవనంది"

"ప్రతిరోజూ సీట్ల దగ్గర ఇదో పెద్ద రగడ అయింది. అందరూ కూచుంటేనేగాని బస్సు కదలదు. మీరూ మీరూ తేల్చుకోండని" బస్సు స్టార్టు చెయ్యకుండా కూచున్నాడు.

ఒకాయన లేచి

"మాస్టారూ మీరు ముప్పయి అయిదులో ఆమె పక్కనే కూచోండి. ఇంతమంది చెప్తున్నా వినకపోతే ఏంచేస్తాం" అన్నాడు తీవ్రంగా.

"ఏంటయ్యో పెద్ద చెప్తున్నావు. నా పక్కసీట్లో కూచోవాల్సింది ఆ ముసలమ్మ. ఆవిణ్ణొచ్చి కూచోమనండి. ఇందాకట్నుంచీ చూస్తున్నా. ఈయన తనసీటెవరికో దానం ఇచ్చి ఇక్కడొచ్చి కూచుంటాననంటుంటే పైగా సమర్థింపొకటా" అంటూ ఒక్క దులుపు దులిపింది.

మరో పదినిమిషాలు రకరకాల కామెంట్లు దొర్లాయి బస్సులో.


చివరికి ... వంట్లో బాగుండని భర్తను నాకంటగట్టి ... ముందుసీట్లో కూచున్న ముసలావిడ ముప్పయిఅయిదో నంబరు సీటుకి వచ్చి కూచుంది.

నా సీట్లో కూచున్న ప్రెగ్నెంట్ స్త్రీని లేపడమెందుకనుకుని, సర్దుకుపోదామనుకున్న నావల్లే బస్ లేటయిందన్న అభాండంతో బస్ బయల్దేరింది.

తలపైకెత్తిన నాకు "స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం" అన్న స్లోగను కంటబడ్డది.

సాధారణ బస్సుల్లో గర్భిణీ స్త్రీలు, పిల్ల తల్లులు, వృద్ధులు నుంచుంటే చూళ్ళేక లేచి నుంచుని వాళ్ళకు సీటిచ్చే నా సంస్కారాన్ని స్లోగనులోని సంప్రదాయం వెక్కిరిస్తున్నట్టనిపించింది.

ఎవరిసీట్లు వారికుండే నాన్‌స్టాప్ బస్సులో చిన్న అడ్జస్ట్‌మెంట్‌కోసం స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్టు బిహేవ్ చేసిన ముప్పయినాలుగో నంబరులో కూచున్నావిడ లాంటివాళ్ళకు ఈ "సంప్రదాయం" అన్న మాట ఎలా వర్తిస్తుందో మీరే నిర్ణయించండి.



## పడవ ప్రయాణం

పడవలో ప్రయాణం చెయ్యడానికి ఓ నదో, పెద్ద చెరువో కావాలని మనకు తెలుసు. అయితే పడవ ప్రయాణానికి వాటి అవసరం లేదని. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ బోట్ సిబ్బంది అన్నారు. వారు తమ శిక్షణలో భాగంగా ఒక పెద్దచెరువును నిర్మించి, దాంట్లో పడవ ప్రయాణం చేశారు. ఒక పెద్ద నదిలో ప్రయాణం చేసేడప్పుడు ఎదురయ్యే పరిస్థితి నంతా ఆ చెరువులో ఏర్పాటు చేశారు. యూనివర్శిటీవారు. ఆ చెరువు, ఆ బోటు తమాషాగా ఉన్నాయి కదూ, ఆహా ఈ పడవ ప్రయాణంలో ఒక అందగత్తె కూడా పాల్గొంది.

– కోడిమెల